క్లుప్తంగా

పింఛన్లు పునరుద్ధరించాలి

ఒంగోలు అర్బన్: వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు వివిధ కారణాలతో రద్దయిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో సోమవారం వికలాంగులు ర్యాలీ, కలెక్టర్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో కొంతమంది అర్హులకు కూడా పింఛన్ రద్దయిందని, కేవలం పింఛన్‌పై ఆధారపడే వారు దీనివలన ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిజమైన లబ్ధిదారులకు రద్దయిన పింఛన్‌ను పునరుద్ధరించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు సాయి జనార్దన్, సురేష్, రాజయ్య, ఉలిచి కోటేశ్వరరావు, షేక్ సలాం, బాలజీ, పలువురు వికలాంగులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరాలపై దాడులు

కొత్తపట్నం: కోడిపందేల శిబిరాలపై పోలీసులు సోమవారం దాడులు చేశారు. మండలంలోని కె.పల్లెపాలెం శివారు ప్రాంతాల్లో కోడిపందేలు వేస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,400 నగదు, 3 కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కోర్టుకు హాజరుపరచనున్నట్లు చెప్పారు.

ఎంపీపీకి కార్యదర్శుల శుభాకాంక్షలు



ఎంపీపీ వాకా అరుణ, ఎంపీడీవోకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యదర్శులు

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాల సచివాలయాల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు సోమవారం ఉదయం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డికి, ఎంపీడీవో శ్రీనివాసరావుకు శాలువాలు కప్పి బొకేలిచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పలువురు కార్యదర్శులు హాజరు కాని క్రమంలో ప్రత్యేకంగా సోమవారం ఎంపీపీ, ఎంపీడీవోను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షుడు నారా సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, మందా చిన్న, గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాలినేనిని కలిసిన ఎమ్మెల్యే కేపీ



బాలినేనిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డిని సోమవారం ఒంగోలులో ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించారు. భారీ గజమాలతో బాలినేనిని సన్మానించి ఎమ్మెల్యే కేపీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషీర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీ కృష్ణ, నాయకులు రామసుబ్బారెడ్డి, రమణారెడ్డి ఉన్నారు.

దైవజ్ఞానంతో సుఖశాంతులు

ఒంగోలు టౌన్: దైవజ్ఞానంతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఒంగోలు కమిటీ అధ్యక్షుడు సుబ్బారావు కోరారు. నూతన సంవత్సరం, ఉత్తరాయణ కాలం ఆగమనాన్ని పురస్కరించుకుని సోమవారం పెళ్లూరులో హిందూ ధర్మ ప్రచారాన్ని నిర్వహించారు. అసలైన జ్ఞానాన్ని తెలుసుకున్నప్పుడు ప్రతిఒక్కరూ సంతోషంగా ఉంటారని ఆయన అన్నారు. సంపాదనే ధ్యేయంగా మనిషి పరుగులు తీస్తున్నాడని, తనను సృష్టించిన దేవుడ్ని తెలుసుకునేందుకు సమయం లేదని చెబుతున్న ఆధునిక మానవుడు ఎంత సంపాదించినా తృప్తి లేకుండా మరణిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. జనన మరణ చక్రం నుంచి బయటపడాలని హితవు పలికారు. కార్యక్రమంలో గొంగాటిరెడ్డిపాలెం కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, దర్శి అధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



కొత్తపట్నంలో ప్రత్యేక అలంకరణలో రాజగోపాలస్వామి



కొత్తపట్నంలో ప్రత్యేక అలంకరణలో షిర్డీ సాయిబాబా



ఒంగోలు శ్రీగిరిలో ఉత్తర ద్వార దర్శనమిస్తున్న వెంకటేశ్వరస్వామి



ఒంగోలు సంతపేట సాయిబాబా ఆలయంలో అలంకరణలో వెంకటేశ్వరస్వామి



చీమకుర్తి హరిహరక్షేత్రంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు

వైకుంఠ వైభవం

- ఆలయాలకు వైకుంఠ ఏకాదశి శోభ
- ఉత్తర ద్వార దర్శనమిచ్చిన స్వామివారు
- పోటెత్తిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో పూజలు

ఒంగోలు టౌన్:

వైకుంఠ ఏకాదశి పండుగను పురస్కరించుకుని సోమవారం ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేయగా, భక్తులు భారీగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయాలన్నింటినీ అలంకరించడంతో పాటు భక్తులు పోటెత్తడంతో ప్రత్యేక శోభ సంతరించుకుంది. ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కళకళలాడింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచే వేల సంఖ్యలో భక్తులు గరుఢ వాహనంపై కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీగిరి శ్రీవెంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వారంలో దర్శించుకున్నారు. ఒంగోలు నగరంలోని పలు ఆలయాలు భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగాయి. ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లో...

చీమకుర్తి: చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లోని పలు ఆలయాల్లో స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజామునుంచే భక్తులు బారులు దీరారు. చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో శ్రీవెంకటేశ్వరస్వామిని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుని విశేష పూజలు నిర్వహించారు. వేదపండితుల ద్వారా స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించారు. ధనుర్మాస వేడుకల్లో భాగంగా హరిహరక్షేత్రంలో ప్రాత:కాలంలో గోదాదేవి సమేత శ్రీరంగనాథస్వామికి విశేష పూజలు నిర్వహించారు. శిద్దా రాఘవరావు దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించి భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో శిద్దా కుటుంబీకులతో పాటు చీమకుర్తి పట్టణంలోని పలువురు భక్తులు పాల్గొన్నారు. చీమకుర్తిలోని పల్లపోతువారిబజారులో శ్రీవెంకటేశ్వర స్వామి, శ్రీసీతారాములస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకల్లో స్థానిక భక్తులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. సంతనూతలపాడులోని శ్రీచెన్నకేశవస్వామి, కోదండరామస్వామి, సీతారామస్వామి, ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని స్వామివారి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలోని మల్లవరం, ఇనమనమెళ్లూరు, మద్దిపాడు, తదితర గ్రామాల్లోని వైష్ణవాలయాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 6 గంటల నుంచే ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు భారీగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామునే మహిళా భక్తులు తలస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి బారులు దీరారు. స్వామివారి దర్శనం అనంతరం గర్భగుడిలోకి వెళ్లి స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, రాజశేఖరాచార్యులు స్వామివారికి ప్రత్యేకంగా అలంకరణలు చేసి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానంతరం వెంకటేశ్వరస్వామి సేవా మండలి సభ్యులు పులిహోర, దద్దోజనం, పాయసాలను స్వామివారికి నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదాలుగా పంచిపెట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ నారా నాగిరెడ్డి, ఈవో దామా నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: మండలంలోని అన్ని ఆలయాల్లో సోమవారం భక్తులు పెద్ద ఎత్తున పూజా కార్యాక్రమాలు నిర్వహించారు. ఉప్పుగుండూరు గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ పెంట్యాల జ్యోతి శ్రీనివాసరావు, ఈవో మీనిశెట్టి ఆధ్వర్యంలో పూజారి దివి శ్రీధర్‌బాబు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. చదలవాడ గ్రామంలోని రఘునాయకస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఒమ్మెవరం గ్రామంలో బ్రహ్మంగారి ఆలయంలో ఏకనామ భజన కీర్తనలో భక్తులు పాల్గొన్నారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: స్థానిక ఆదికేశవస్వామి, రాజగోపాలస్వామి, సాయిబాబా ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజగోపాలస్వామి ఆలయ చైర్మన్ అన్నం వెంకటసుబ్బారావు, ఆదికేశవస్వామి ఆలయ చైర్మన్ సూరిశెట్టి సుబ్బారావు, శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ చైర్మన్ కూరపాటి ప్రకాశరావు పాల్గొన్నారు. ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలతో పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. రాజగోపాలస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి మంగళవారం ఉదయం 7 గంటల వరకు అకండ హరే రామ, హరే కృష్ణ కొనసాగుతుందని ఎండోమెంట్ ఈవో వరదారెడ్డి తెలిపారు.



చదలవాడలో రఘునాయకస్వామి గ్రామోత్సవం



ఒంగోలులో ప్రసన్న చెన్నకేశవస్వామిని ఉత్తర ద్వారంలో దర్శించుకుంటున్న భక్తులు



సంతనూతలపాడులో పూజలు చేస్తున్న భక్తులు



మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఇస్తున్న స్వామివారు

పింఛన్ల పండుగ

- పండుగ వాతావరణంలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ
- కొత్తగా మంజూరైన పలువురికి అందజేత
- పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

చీమకుర్తి: పింఛన్ల పంపిణీ కార్యక్రమాలను సోమవారం పలు ప్రాంతాల్లో పండుగ వాతావరణంలో నిర్వహించారు. కొత్తగా పలువురికి పింఛన్లు మంజూరవడంతో వారందరికీ ప్రత్యేకంగా పంపిణీ చేశారు. ఇప్పటికే పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు ఈ నెల నుంచి రూ.250 పెంచి రూ.2,750 అందించడంతో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సంతనూతలపాడు మండలం ఎండ్లూరులో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ చేతుల మీదుగా సోమవారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పెరిగిన పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎస్.పుల్లయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఒంగోలు 40వ డివిజన్ పరిధిలో...

ఒంగోలు 40వ డివిజన్ పరిధిలోని పేర్నమిట్టలో స్థానిక కార్పొరేటర్ టీ చంద్రశేఖర్ చేతుల మీదుగా 550 మందికి పెరిగిన పింఛన్లను రూ.2,750 చొప్పున లబ్ధిదారులకు అందించారు. సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతోందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతిఒక్కరూ సంతోషంగా ఉన్నారని ఉప్పుగుండూరు గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ అన్నారు. పెంచిన పింఛన్లతో పాటు నూతనంగా మంజూరైన పింఛన్లను సోమవారం ఉప్పుగుండూరు గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆమె అందజేశారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం గ్రామ సచివాలయ కన్వీనర్లుగా ఎంపికైన వారిని వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మాదాసు రాంబాబు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మున్నంగి వెంకట్రావు, తాటి అనురాధ, కొలకలూరి విజయ్ కుమార్, పేరాల చెన్నకేశవులు, పెంట్యాల శ్రీను, పాలపర్తి ప్రవీణ్, మద్దిసాని రాజేష్, కందుల దానియేలు, వజ్రంబాబు, పంచాయతీ ఈవో శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఎండ్లూరులో పింఛన్లు అందిస్తున్న దుంపా చెంచిరెడ్డి, రమణమ్మ

పెన్షన్ల పంపిణీని పరిశీలించిన పీడీ

ఒంగోలు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పెన్షన్ల పంపిణీని డీఆర్‌డీఏ పీడీ బాబూరావు సోమవారం పరిశీలించారు. సర్వేరెడ్డిపాలెంలో పెన్షన్ స్వయంగా అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల నుంచి పెన్షన్‌ను రూ.250 పెంచి అందించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గోపీనాథ్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆదిశేషయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఉప్పుగుండూరులో నూతన పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీలు

కొత్త పెన్షన్లు పంపిణీ చేసిన ఎంపీపీ

మద్దిపాడు: ఇచ్చిన మాట నిలబెట్టుకుని ప్రతి సంవత్సరం రూ.250 పెంచుకుంటూ రూ.2 వేల నుంచి రూ.2,750కి పెన్షన్ పెంచి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇస్తున్న ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే.. అది కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. మద్దిపాడు సచివాలయంలో సోమవారం నిర్వహించిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగనన్న పేద, బడుగు బలహీనవర్గాలకు అండగా నిలుస్తూ వారి ఉన్నతికి పాటుపడుతున్నారని తెలిపారు. అవ్వాతాతలకు పెన్షన్లు పెంచి ఇస్తూ ఆసరాగా నిలుస్తున్నారన్నారు. మద్దిపాడు గ్రామంలో కొత్తగా 16 పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు మంజూరవుతున్నాయన్నారు. టీడీపీ నాయకులు కొందరు పెన్షన్లు తీసివేస్తున్నారంటూ ప్రచారం చేస్తున్నారని, అటువంటి ప్రచారాలను నమ్మవలసిన అవసరం లేదని ఆమె అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు మాట్లాడుతూ పెన్షన్లు తీసివేయాల్సిన అవసరం ఎవరికీ లేదని, విద్యుత్ శాఖ నుంచి బిల్లు ఎక్కువ వచ్చినా, కారు ఉన్నా, ఇన్‌కం ట్యాక్స్ చెల్లిస్తున్న వారికి మాత్రమే పెన్షన్లు రావని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, మోరబోయిన సంజీవరావు, సచివాలయ కన్వీనర్లు మద్దా లక్ష్మీనారాయణ, షేక్ వలీ, ఏలూరి నాగలక్ష్మి, గ్రామ కార్యదర్శి ఆశాలత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నూతనంగా పెన్షన్లు పొందిన వారు పాల్గొన్నారు.



సర్వేరెడ్డిపాలెంలో పెన్షన్ల పంపిణీని పరిశీలిస్తున్న పీడీ బాబూరావు



మద్దిపాడు: నూతన పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎంపీడీవో, నాయకులు

పోలీసు క్రీడాకారిణిని అభినందించిన కలెక్టర్



వెంకటలక్ష్మిని అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మద్దిపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న వెంకటలక్ష్మిని కలెక్టర్ దినేష్‌కుమార్ అభినందించారు. గల నెలలో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో 40 ప్లస్ విభాగంలో 100 మీటర్ల హర్డిల్స్‌లో రాణించి ప్రథమ స్థానంలో నిలిచి లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకాలు సాధించిన ఏఎస్సై వెంకటలక్ష్మి సోమవారం మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 40 సంవత్సరాలు దాటిన వయసులో కూడా క్రీడల్లో రాణించిన ఏఎస్సైని అభినందించారు. ఇటువంటి క్రీడాకారులు పోలీస్ శాఖలో పనిచేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో పెద్ద సంఖ్యలో క్రీడాకారిణులు పోలీస్ శాఖలో పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ పీడీ రవిశంకర్, పలువురు రెవెన్యూ, పోలీసు శాఖ క్రీడాకారులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తా

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి

ఒంగోలు: పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి అన్నారు. స్థానిక భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2024 ఎన్నికల దృష్ట్యా పార్టీని అన్ని నియోజకవర్గాల్లో బలోపేతం చేస్తామన్నారు. అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి పార్టీకి ఉజ్వల స్థానాన్ని అందిస్తానన్నారు. ఒక సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు జిల్లా అధ్యక్ష పదవి రావడం ఆనందంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుతో పాటు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివారెడ్డిని బీజేపీ నాయకులు సన్మానించారు.



శివారెడ్డిని సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

పేస్ ఎంబీఏ విద్యార్థులకు ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు: తమ కాలేజీలో చదువుతున్న ఎంబీఏ విద్యార్థులు 15 మంది రూ.6 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేస్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యగ్నాటిక్ లెర్నింగ్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను శ్రీధర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, కళాశాల డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ వీరాంజనేయులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు సాగు చేయాలి

తాళ్లూరు: మండలంలో చిరుధాన్యాలు, ప్రకృతి వ్యవసాయం పెంపు లక్ష్యంగా 2023లో పనిచేయనున్నట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. గతేడాది సజ్జలు, కొర్రలు, వరిగలు 119 ఎకరాల్లో సాగు చేశారని చెప్పారు. 2023 అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిన నేపథ్యంలో మండలంలో 2 వేల ఎకరాల సాగు లక్ష్యంగా పనిచేసేందుకు నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ప్రతి ఆర్‌బీకేలో చిరుధాన్యాలతో తక్కువ ఖర్చు, ఎక్కువ దిగుబడి, రాబడి ఉంటుందని ప్రచారం చేయనున్నట్లు వివరించారు.

7న నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

ఒంగోలు: రంగస్థల పౌరాణిక రాష్ట్ర, జిల్లా కళాకారుల సమాఖ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని ఈ నెల 7వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు స్థానిక సీవీఎన్ క్లబ్ ఆవరణలో నిర్వహించనున్నట్లు రంగస్థల కళాకారులు, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి తెలిపారు. సోమవారం ఒంగోలులోని ఆయన నివాసంలో సంబంధిత పోస్టర్, కరపత్రాలను మాజీ ఎంపీపీ లంకపోతు లక్ష్మితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరాణిక నాటకాలకు గతంలో ఎంతో ఆదరణ ఉండేదని, నేడు తగ్గిందని అన్నారు. నాటకాలు ప్రజల్లో ఆలోచనలు రేకెత్తించడంతో పాటు ఆనందంగా, ఆహ్లాదంగా ఉంచేందుకు తోడ్పడతాయన్నారు. 7వ తేదీ ప్రమాణ స్వీకారంతోపాటు పౌరాణిక నాటకాలు ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రేక్షకాభిమానులు, కళామతల్లి ముద్దు బిడ్డలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శాంతారావు, జయరావు, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.